సాక్షి విశాఖపట్నం

శనివారం । 28 । డిసెంబర్ । 2024



ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు



భారం తగ్గించకుంటే

ఖబడ్దార్



విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ రోడ్డెక్కిన జనం

మద్దతు పలికిన వైఎస్సార్‌సీపీ

చార్జీల పెంపు ఉపసంహరించుకోవాలని డిమాండ్

కూటమి ప్రభుత్వానికి ప్రజల హెచ్చరిక

సామాన్యుడే కదా.. ఏం చేసినా సైలెంట్‌గా ఉంటారని కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. సంపద సృష్టి అంటూ.. సామాన్యుడి నడ్డి విరిచేలా విద్యుత్ చార్జీల భారాన్ని మోపింది. గద్దెనెక్కిన తర్వాత ఆరు నెలలుగా ప్రభుత్వం బాదుడికి ప్రజల్లో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారెంటీ అంటూ నినదిస్తూ రోడ్డెక్కిన జనానికి వైఎస్సార్ సీపీ బాసటగా నిలిచింది. విద్యుత్ చార్జీల పెంపుపై పోరుబాటతో విశాఖ జిల్లా హోరెత్తింది. తక్షణమే భారం దించకపోతే కూటమి సర్కార్‌కి షాకిస్తామంటూ జనం హెచ్చరించారు. విద్యుత్ చార్జీల భారాన్ని వ్యతిరేకిస్తూ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఆందోళన ప్రదర్శనలతో ప్రభుత్వానికి ప్రత్యక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన పోరుబాట విజయవంతమైంది.

- సాక్షి, విశాఖపట్నం

భీమిలిలో..



తగరపువలసలో ప్రజలతో కలిసి జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, కార్పొరేటర్ దొలపల్లి ఏడుకొండలు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు బైపాస్‌రోడ్డులోని వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం వద్ద నుంచి పోరుబాట ప్రారంభించారు. 'చంద్రబాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారంటీ అంటూ నినాదాలు చేస్తూ చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రాలు అందించారు. పద్మనాభం ఎంపీపీ కె.రాంబాబు, పార్టీ మండల అధ్యక్షులు గాడు శ్రీను, కోరాడ లక్ష్మణ్, బంక సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర నియోజకవర్గంలో..

నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గురుద్వార్ జంక్షన్ నుంచి పోరుబాటు ప్రారంభమైంది. ప్రజలతో కలిసి వైఎస్సార్ సీపీ నేతలు ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, మళ్ల విజయప్రసాద్, తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకటరామయ్య, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, కార్పొరేటర్లు పాదయాత్రగా వస్తూ ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. డిస్కమ్‌ల అధికారులకు వినతి పత్రం అందించేందుకు యత్నించగా.. పోలీసులు శాంతియుత నిరసనను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కార్యాలయం గేట్లు మూసేసి ఆందోళనను అణచివేతకు ప్రయత్నిస్తూ.. కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. కానీ.. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు ఏమాత్రం సహనం కోల్పోకుండా.. కేవలం వినతి పత్రం అందించి వస్తామంటూ పోలీసులతో స్పష్టం చేశారు. దీంతో కొందరిని మాత్రమే లోపలికి అనుమతించారు. అనంతరం విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని కోరుతూ సీజీఎం, ఇన్‌చార్జి ఆపరేషనల్ డైరెక్టర్ విజయలలితకు వినతిపత్రం అందించారు.



ఆపరేషనల్ డైరెక్టర్ విజయలలితకు వినతిపత్రం అందజేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, ఎంపీ బాబూరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మేయర్ హరివెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, కార్పొరేటర్లు

గాజువాకలో...

పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గంలో నిరసన ప్రదర్శలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పోరుబాటలో పాల్గొన్నారు. సబ్‌స్టేషన్ దగ్గర ఆందోళన చేపట్టారు. అక్కడి నుంచి భెల్ దగ్గర ఉన్న ఈపీడీసీఎల్ సబ్ డివిజన్ కార్యాలయానికి చేరుకున్నారు. ఏఈఈ పార్థసారధికి వినతిపత్రం అందించారు.



విశాఖ పశ్చిమలో..



విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ పశ్చిమ నియోజకవర్గంలో ప్రదర్శనలు మిన్నంటాయి. నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ ఆధ్వర్యంలో ఆయా వార్డుల నుంచి కార్యకర్తలు, నాయకులు, కార్పొరేటర్లు మల్కాపురం జంక్షన్ నుంచి సబ్‌స్టేషన్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఈపీడీసీఎల్ ఏడీ మాధవికి వినతిపత్రం ఇచ్చారు.

విశాఖ దక్షిణలో...



పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని దక్షిణ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నేతృత్వంలో జగదాంబ జంక్షన్ వద్ద వినూత్న రీతిన నిరసన జరిగింది. లాంతర్లు, గ్యాస్ లైట్లు, నెత్తిన విద్యుత్ బల్బులు పెట్టుకుంటూ ఆందోళన చేశారు. అనంతరం వైఎస్సార్ విగ్రహ కూడలి నుంచి వాల్తేర్ అప్ రోడ్డు మీదుగా విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాన్ వెస్లీ, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, కార్పొరేటర్లు తోట పద్మావతి, చెన్నా జానకీరామ్, కోడిగుడ్ల పూర్ణిమ, బిపిన్‌కుమార్ జైన్‌లతో కలిసి ఎస్ఈ జి.శ్యామ్‌బాబుకు వాసుపల్లి వినతిపత్రం అందజేశారు.

విశాఖ తూర్పులో..

తూర్పు నియోజకవర్గంలో ప్రజలతో కలిసి ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పండుల రవీంద్రబాబు, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మొల్లి అప్పారావు, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి ఆధ్వర్యంలో పోరుబాట విజయవంతంగా నిర్వహించారు. పెదవాల్తేరు విశాఖ కంటి ఆస్పత్రి నుంచి ర్యాలీగా వెళ్లి విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.





పెందుర్తిలో..

మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపుపై నిరసనలతో పెందుర్తి హోరెత్తింది. రాంపురం నుంచి ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు బైక్ ర్యాలీగా బయలుదేరి.. పెందుర్తి ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి పాదయాత్రగా పెందుర్తి సబ్ స్టేషన్ సమీపంలోని విద్యుత్ శాఖ ఏడీ కార్యాలయానికి చేరుకుని.. అధికారులకు వినతిపత్రం అందించారు.

ఆయన చంద్ర'బాదుడు'

సాక్షి, విశాఖపట్నం: సంపద సృష్టిస్తానంటూ రాష్ట్ర ప్రజలపై విద్యుత్ చార్జీల పేరుతో పెను భారాన్ని మోపి.. ముఖ్యమంత్రి చంద్రబాబు.. చంద్ర'బాదుడు'అని మరోసారి నిరూపించుకున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యానించారు. పోరుబాటలో భాగంగా ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఎన్నికలకు ముందు నాణ్యమైన విద్యుత్ ఇస్తామని, ప్రజలపై ఎలాంటి భారాన్ని మోపబోమని చంద్రబాబు హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యుత్ చార్జీల పేరుతో రూ.15 వేల కోట్లకు పైగా ప్రజలపై పెను భారం మోపారు. ఒకేసారి విద్యుత్ చార్జీలు పెంచితే ప్రజలు తిరుగుబాటు చేస్తారని విడతల వారీగా పెంచుతూ మార్చి నాటికి యూనిట్‌పై రూ.2 వరకు పెంచుతున్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్రాన్ని అప్పు ల పాలు చేస్తున్నారంటూ ఇష్టం వచ్చినట్లు అబద్ధాలు చెప్పిన కూటమి నేతలు.. ఇప్పుడు కేవలం ఆరు నెలల్లో వేల కోట్ల అప్పు చేశారు. ఈ డబ్బు ఏమయింది? ఒక్క రూపాయి అయినా పేదవాడికి ఇచ్చారా? అమరావతికి రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తే.. రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాల పరిస్థితి ఏమవుతుందో ఆలోచించాలి. ఫీజు రీయంబర్స్‌మెంట్‌పై త్వరలోనే ఆందోళన నిర్వహిస్తాం. అమరావతి తప్ప ఏమీ అవసరం లేదన్నట్లుగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది.' అని అమర్‌నాథ్ మండిపడ్డారు. ఎంపీ గొల్ల బాబూరావు మాట్లాడుతూ కూటమి వైఫల్యాల్ని ఎండగడతామన్నారు. 'మూడు సార్లు సీఎంగా ఉన్న సమయంలో చంద్రబాబు చేసినవన్నీ మోసాలే. చంద్రబాబు చెప్పిన మాట, చేసిన వాగ్దానం ఎప్పుడైనా నిలబెట్టుకున్నారా? ప్రజల్ని భ్రమల్లో పెట్టడమే అతనికి తెలిసిన విద్య. ఈ సారీ అదే బాటలో వెళ్తూ ప్రజలను అథోగతిపాల్జేస్తున్నారు. ఆరు నెలల్లో రూ.లక్ష కోట్లు అప్పు చేశారు. చంద్రబాబు దుర్మార్గపు పాలనపై పార్లమెంట్‌లో నిలదీస్తాం. దేవుడి దయ వల్ల జమిలి ఎన్నికలు త్వరగా వచ్చి.. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వర్ణయుగం రావాలని ప్రార్థిస్తున్నాం.'అని బాబూరావు అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అనుబంధ విభాగం అధ్యక్షులు వంగపండు ఉష, పేర్ల విజయ్ చంద్ర, పోతిన శ్రీను, పార్టీ ముఖ్య నాయకులు శోభా హైమావతి, చొక్కాకుల వెంకటరావు, తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, జహీర్ అహ్మద్, రొంగలి జగన్నాథం, పేడాడ రమణికుమారి, మాధవీ వర్మ, నడింపల్లి కృష్ణంరాజు, గండి రవికుమార్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు స్వాతి దాస్, కెల్లా సునీత, అనిల్ కుమార్ రాజు, ముప్పల లక్ష్మి సురేష్, సాడి పద్మా రెడ్డి, బిపిన్ కుమార్ జైన్, ఆళ్ల శంకరరావు, రెయ్యి వెంకట రమణ, శశికళ, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, పార్టీ నాయకులు పోతిన హనుమంత్, రామన్న పాత్రుడు, మారుతీ ప్రసాద్, వానపల్లి ఈశ్వరరావు, పెంద్ర అప్పన్న, బోని శివ రామకృష్ణ, జీలకర్ర నాగేంద్ర, మల్లేశ్వరి, దేవర కొండ మార్కేండేయులు, తుళ్లి చంద్రశేఖర్, బెందాళం పద్మావతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్. చిత్రంలో ఎంపీ బాబూరావు

మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు

మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ లక్ష్మి



మాజీ ప్రధానితో మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం: దేశ ఆర్థిక వ్యవస్థను సుస్థిరం చేసిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికే తీరని లోటు అని ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని వివరించారు. ఆయన ఆర్థిక విధానాల ఫలితాలతోనే ఈ రోజు భారత్ ఆర్థికంగా చెప్పుకోదగిన స్థానంలో నిలిచిందన్నారు. తాను ఎంపీగా ఎన్నికైన తొలినాళ్లలో పార్లమెంట్‌లో చురుకుగా ప్రశ్నలు అడిగేందుకు ఆయన ఎంతో ప్రోత్సహించారని గుర్తు చేసుకున్నారు.

ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మహారాణిపేట: వన్‌టౌన్, పోర్టు పరిసర ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సీఈఎంఎస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమోడోర్ ఎస్.గోపీకృష్ణ తెలిపారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ సీఎస్సార్ నిధులతో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి, ఉపాధి సహకారం అందిస్తామని ప్రకటనలో పేర్కొన్నారు. 27 ఏళ్ల లోపు వయసు గల బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్, ఐటీఐ, ఫిట్టర్, టర్నర్, ఎలక్ట్రికల్, మిషనిస్టు, వెల్డర్, డిప్లొమో మెకానికల్, ఎలక్ట్రికల్, ఇంటర్, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సీఈఎంఎస్, సింధియా జంక్షన్‌లో ఉన్న కార్యాలయంలో లేదా 86884 11100, 83319 01237, 0891-2704010లో సంప్రదించవచ్చు.

నేటి నుంచి నావికాదళ సన్నాహక విన్యాసాలు

ఏయూక్యాంపస్: ఆర్.కె.బీచ్‌లో ఈ నెల 28, 29, జనవరి 2 తేదీల్లో నౌకాదళ సన్నాహక విన్యాసాలు జరగనున్నాయి. జనవరి 4న నిర్వహించే నౌకాదళ పూర్తి విన్యాసాలకు ముందస్తుగా మూడు రోజుల పాటు రిహార్సల్ చేస్తున్నట్లు నేవీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్‌లు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, నావికాదళ బ్యాండ్, మెరైన్ కమాండోలు (మార్కోస్) ప్రదర్శనలతో సాగరతీరం యుద్ధ సంగ్రామంలా మారనుంది. విన్యాసాలు తిలకించేందుకు వచ్చే ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు కోరారు. జనవరి 4 వరకు విన్యాసాలు జరిగే ప్రాంతాల్లో డ్రోన్లు, గాలిపటాలు వంటివి ఎగురవేయవద్దని ప్రజలను కోరారు. కాగా, నేవీ విన్యాసాలకు నౌకాదళం, జీవీఎంసీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. విశ్వప్రియ ఫంక్షన్ హాలు ఎదురుగా ముఖ్యమంత్రి, ఇతర అధికారుల కోసం ప్రధాన వేదికతో సహా ఇతర వేదికల నిర్మాణాలు దాదాపుగా పూర్తయ్యాయి. అలాగే ఫుట్‌పాత్‌ను ఆనుకుని బారికేడ్ల నిర్మాణం కూడా పూర్తవుతోంది.



బీచ్‌రోడ్డులో సిద్ధమవుతున్న ప్రధాన వేదిక

నేపాల్‌తో ఆంధ్ర పర్యాటక ఒప్పందం

విశాఖలో త్వరలోనే నేపాల్ కాన్సులేట్ కార్యాలయం

డాబాగార్డెన్స్: పర్యాటక అభివృద్ధికి నేపాల్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. నగరంలోని ఓ హోటల్లో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. భారత్‌లోని నేపాల్ అంబాసిడర్ డాక్టర్ సురేంద్ర తాపాతో పాటు బృంద సభ్యుడు తారానాథ్ అధికారి, ఏపీ టూరిజం చైర్మన్ నూకసాని బాలాజీ, ఏపీ టూరిజం ఫోరం అధ్యక్షుడు కన్నెగంటి విజయమోహన్, టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థ ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. దేశంలో ఇలాంటి ఒప్పందం ఆంధ్రప్రదేశ్ తప్ప మరే రాష్ట్రానికి జరగలేదని ఆయా విభాగాల ప్రతినిధులు తెలిపారు. పర్యాటక రంగంలోని కొత్త అంశాలు, మార్కెట్, పరిశ్రమ అభివృద్ధికి సంబంధించి ఏపీ, నేపాల్ పరస్పర సహకారాన్ని ఈ ఒప్పందం ద్వారా అందిపుచ్చుకుంటాయన్నారు. విశాఖలో త్వరలో నేపాల్ కాన్సులేట్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దసపల్లా హోటల్స్ గ్రూప్ చైర్మన్ రాఘవేంద్రరావు, గుజరాత్ టూరిజం ఆఫీసర్ అజిత్‌కుమార్, ఏపీ హోటల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎంపీ పవన్ కార్తీక్, ఏపీ ఎయిర్ ట్రావెల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి నరేష్‌కుమార్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు సాంబశివరావు, ధీరజ్‌కుమార్, శ్రీనివాస్‌కుమార్, రేస్ ఈవెంట్ అధినేత డి రవికుమార్, పలువురు ట్రావెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.



ఒప్పందం కుదుర్చుకుంటున్న ఏపీ, నేపాల్ ప్రతినిధులు

ప్రత్యేక రైళ్ల పొడిగింపు



తాటిచెట్లపాలెం: ప్రయాణికుల డిమాండ్, పండగల నేపథ్యంలో ప్రస్తుతం నడుస్తున్న పలు ప్రత్యేక రైళ్లు మరి కొంతకాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. • విశాఖపట్నం-పార్వతీపురం(08565) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ విశాఖలో ప్రతీ రోజు ఉదయం 10 గంటలకు బయల్దేరి, అదేరోజు మధ్యాహ్నం 12.20 గంటలకు పార్వతీపురం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో (08566) పార్వతీపురంలో మధ్యాహ్నం 12.45 గంటలకు బయల్దేరి సాయంత్రం 4 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు జనవరి 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నడుస్తాయి. • హైదరాబాద్-కటక్(07165) స్పెషల్ ప్రతీ మంగళవారాలలో హైదరాబాద్‌లో రాత్రి 8.10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడకు, సాయంత్రం 5.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జనవరి 7, 14, 21వ తేదీల్లో నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కటక్-హైదరాబాద్(07166) స్పెషల్ ప్రతీ బుధవారాల్లో రాత్రి 10.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడకు, రాత్రి 9 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. • సికింద్రాబాద్-బ్రహ్మపూర్(07027) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ జనవరి 3, 10వ తేదీల్లో (శుక్రవారం) రాత్రి 8.15 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి మరుసటిరోజు(శనివారం) ఉదయం 9.22 గంటలకు దువ్వాడకు, మధ్యాహ్నం 2.45 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్-సికింద్రాబాద్(07028) స్పెషల్ జనవరి 4,11వ తేదీల్లో (శనివారం) సాయంత్రం 4.45 గంలకు బయల్దేరి అదేరోజు రాత్రి 9.55 గంలకు దువ్వాడకు, మరుసటిరోజు (ఆదివారం) ఉదయం 11.35 గంలకు సికింద్రాబాద్ చేరుకుంటాయి. • హతియా-ఎర్నాకుళం(22837) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 30వ తేదీ నుంచి, ఎర్నాకుళం-హతియా(22838) ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 1వ తేదీ నుంచి ఒక థర్డ్ ఏసీ ఎకానమి కోచ్‌ను జతచేస్తున్నారు.

భారత రైఫిల్ షూటింగ్ ట్రయల్స్ జట్టుకు సాయి కౌశిక్



డాబాగార్డెన్స్: నగరానికి చెందిన 14 ఏళ్ల పేపకాయల సాయి కౌశిక్ భారత రైఫిల్ షూటింగ్ ట్రయల్స్ జట్టుకు ఎంపికయ్యాడని కోచ్ ఉమాశంకర్ తెలిపారు. ఈ నెల 15 నుంచి 24 వరకు భోపాల్‌లో జరిగిన 67వ నేషనల్ రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో సాయి కౌశిక్ 10 మీటర్ల పీప్ సైట్ ఎయిర్ రైఫిల్, 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ విభాగంలో అత్యధిక స్కోర్ చేసి.. రెండు విభాగాల్లో ట్రయల్స్‌కు అర్హత సాధించాడు. అతి చిన్న వయసులో రెండు విభాగాల్లో కౌశిక్ ఎంపిక కావడం గమనార్హమని పలువురు ప్రశంసించారు. ఇండోర్‌లో జరిగిన జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో కూడా 10 మీటర్ల రైఫిల్ షూటింగ్‌లో జాతీయస్థాయిలో మంచి స్కోర్ సాధించాడు. సాయి కౌశిక్ 2022 నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటి వరకు 12 పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా పలువురు షూటర్లు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రతినిధులు కౌశిక్‌ను అభినందించారు.

మాజీ ప్రధానికి స్థాయీ సంఘం నివాళి



మౌనం పాటిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, జీవీఎంసీ స్థాయీ సంఘ సభ్యులు

డాబాగార్డెన్స్: భారత దేశ ఆర్థిక సంస్కర్త, మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం స్థాయీ సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల స్థాయీ సంఘ సభ్యులతో కలసి మేయర్ సంతాపం తెలిపారు. ఆర్థిక సంస్కరణలు అమలు చేయడంలో మన్మోహన్‌సింగ్ కీలకపాత్ర పోషించారని మేయర్ కొనియాడారు. అనంతరం జరిగిన చర్చలో జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో 45 అంశాలు పొందుపరచగా.. మూడు అంశాలను వాయిదా వేసినట్లు మేయర్ తెలిపారు.

మన్మోహన్‌కు వైఎస్సార్ సీపీ నివాళి



మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ నగర కార్యాలయంలో శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యేలు మళ్ల విజయప్రసాద్, తైనాల విజయకుమార్, తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట రామయ్య, సమన్వయకర్త కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పార్టీ కార్యాలయం పర్యవేక్షకుడు రవిరెడ్డి, కార్పొరేటర్లు బానాల శ్రీనివాసరావు, స్వాతి దాస్, కెల్లా సునీత, అనిల్‌కుమార్ రాజు, మువ్వల లక్ష్మీ సురేష్, పద్మారెడ్డి, బిపిన్ కుమార్ జైన్, అల్లు శంకరరావు, రెయ్యి వెంకట రమణ, శశికళ, ముఖ్య నాయకులు వంగపండు ఉష, పేర్ల విజయ్‌చందర్, పోతిన శ్రీను, చొక్కాకుల వెంకటరావు, దేవన్ రెడ్డి, జహీర్ అహ్మద్, మొల్లి అప్పారావు, రొంగలి జగన్నాథం, పేడాడ రమణి కుమారి, మాధవీవర్మ, నడిపల్లి కృష్ణంరాజు, గండి రవికుమార్, సేనాపతి అప్పారావు, పోతిన హనుమంత్, రామన్న పాత్రుడు, మారుతీ ప్రసాద్, వానపల్లి ఈశ్వరరావు, పెంటి అప్పన్న, బోని శివరామ కృష్ణ, జీలకర్ర నాగేంద్ర, మల్లేశ్వరి, దేవరకొండ మార్కేండేయులు, తుళ్లి చంద్రశేఖర్, బెందాళం పద్మావతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, విశాఖపట్నం

విశ్రాంత పోలీసుల సంక్షేమం, ఆరోగ్యానికి ప్రాధాన్యం

- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

ఏయూ క్యాంపస్: విశ్రాంత పోలీసు అధికారుల సంక్షేమానికి, ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం విశాఖ జోన్ వార్షిక సమావేశం శుక్రవారం బీచ్‌రోడ్డులోని పోలీస్ ఆఫీసర్స్ మెస్ ప్రాంగణంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీ మాట్లాడుతూ విశ్రాంత పోలీస్ కుటుంబాల సంక్షేమ చర్యలను మరింత మెరుగ్గా అమలుపరచాలన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ప్రతిపాదించి, ఆమోదించారు. ప్రస్తుతం విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారులకు మార్గదర్శక కార్యక్రమాలను నిర్వహించడం, పోలీసు శాఖకు విధాన సంబంధిత అభిప్రాయాలను అందించడంలో సహకరించాలని నిర్ణయించారు. ఆరోగ్య శిబిరాలు, సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని తీర్మానించారు. ఈహెచ్‌ఎస్ నుంచి పోలీస్ ఆరోగ్య భద్రతకు విశ్రాంత పోలీసు ఉద్యోగుల ఆరోగ్య పథకాలను మార్పు చేయాలని ప్రభుత్వాన్ని కోరాలని నిర్ణయించారు. కార్యక్రమంలో విశ్రాంత డీజీపీ ఎంవీ భాస్కరరావు, డీఐజీ గోపీనాథ్ జట్టి, సంఘం గౌరవ అధ్యక్షుడు ఎంవీ కృష్ణారావు, అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మోహన్, ఉపాధ్యక్షుడు కె.రామకృష్ణారావు, డీవీఎస్ భాస్కర రాజు, ఎస్.దివాకర్, వి.ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్ ప్రసాద్, సంఘం సభ్యులు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 9 వినతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 9 వినతులు వచ్చాయని చీఫ్ సిటీ ప్లానర్ పి.ప్రభాకర రావు తెలిపారు. వీటిలో జోన్–2 నుంచి 2, జోన్–3 నుంచి ఒకటి, జోన్–6 నుంచి 3, జోన్–7 నుంచి 2, జోన్–8 నుంచి ఒక వినతి వచ్చినట్లు చెప్పారు. వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని పట్టణ ప్రణాళికా విభాగ అధికారులను ఆదేశించారు.

డ్వాక్రా మేళా.. అదిరే..

- వనంద్దైన ఉత్పత్తులతో అదరగొడుతున్న మహిళా సంఘాలు



సందర్శకులతో కిటకిటలాడుతున్న స్టాల్స్, స్టాల్స్ తిలకిస్తున్న మహిళలు

ఎంవీపీకాలనీ: సంక్రాంతి సమీపిస్తున్న వేళ ఎక్కడ చూసినా షాపింగ్‌ల సందడే. ఆ పండగ వాతావరణాన్ని మరింత ఇనుమడింపజేస్తూ జీవీఎంసీ, మెప్మా ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా మేళాకు విశేష స్పందన లభిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 100 స్టాళ్ల ద్వారా ఉత్పత్తులను నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ నెల 29 వరకు ఈ మేళా కొనసాగుతుందని, నగర ప్రజలు వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

బంగారాన్ని మరపించేలా..



బంగారాన్ని మరపించే విధంగా సింహాచలానికి చెందిన సాయిగణేష్ జ్యూయలరీ పేరిట మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్‌లో పచ్చల రాళ్లు పొదిగిన ఉంగరాలు, పచ్చల హారాలు, కడియాలు, బ్రాస్లెట్స్, చెవి కమ్మలు అందుబాటులో ఉంచారు. పంచలోహాల్లో వినియోగించే మెటల్స్‌తో వీటిని తయారు చేయడంతో వీటి రంగు మారే అవకాశం లేదని నిర్వాహకులు వెల్లడించారు. రూ.200 నుంచి రూ.1000 ధరలో వీటిని విక్రయిస్తున్నారు. గోల్డ్ కోటెడ్ సిల్వర్ ఉత్పత్తులు, మ్యారేజ్ సెట్స్, సిల్వర్‌పై గోల్డ్ కోటింగ్‌తో తయారు చేసిన రుద్రాక్షమాలలతో పాటు రూ.100 నుంచి రూ.20,000 వరకు విలువచేసే ఉత్పత్తులు విక్రయానికి ఉంచారు.

స్పందన బాగుంది

- కేంద్ర అర్బన్ అఫైర్స్ జాయింట్ సెక్రటరీ రాహుల్ కపూర్



మేళాలో స్టాల్ సందర్శిస్తున్న రాహుల్ కపూర్

డ్వాక్రా ఉత్పత్తుల మేళాకు విశాఖ ప్రజల స్పందన చాలా బాగుందని మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ జాయింట్ సెక్రటరీ రాహుల్ కపూర్ అన్నారు. ఏపీ మెప్మా ఎండీ ఎన్.తేజ్ భరత్‌తో కలసి ఆయన మేళాను సందర్శించారు. ప్రతి స్టాల్‌కు వెళ్లి కొనుగోళ్ల వివరాలు, నగర వాసుల స్పందనను తెలుసుకోవడంతో పాటు ప్రదర్శనలో ఉంచిన ఉత్పత్తులను ఆసక్తిగా తిలకించారు. రాహుల్ కపూర్ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా ఈ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖ నగర ప్రజల నుంచి మేళాకు విశేష స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, మెప్మా ఎండీ తేజ్ భరత్‌తో కలిసి సే నో టూ ప్లాస్టిక్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ 25న ప్రారంభమైన మేళా ఇప్పటి వరకు రూ.27 లక్షల కొనుగోళ్లు సాధించిందన్నారు. ఈ నెల 29 వరకు మేళా విజయవంతంగా కొనసాగుతుందన్నారు. అనంతరం రాహుల్ కపూర్, మెప్మా ఎండీలను సత్కరించారు. జీవీఎంసీ యూసీడీ పీడీ సత్యవేణి పాల్గొన్నారు.

నేచురల్ మిల్లెట్స్



బాబు ఎంపీఎస్ గ్రూపునకు చెందిన మహిళలు విక్రయిస్తున్న 9 రకాల చిరుధాన్యాలకు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. సహజ సిద్ధంగా పండించిన వీటిని సేకరించి మార్కెట్ చేస్తున్నారు. దీంతో పాటు సిద్ధ సన్నాలు, మైసూర్ మల్లిక, బ్రౌన్ రైస్, బ్లాక్ రైస్ తదితర రైస్ ఉత్పత్తులను వీరు విక్రయిస్తున్నారు. అరకేజీ మిల్లెట్ ప్యాకెట్లు రూ.60, కేజీ ప్యాకెట్లు రూ.120 కి విక్రయిస్తున్నారు.

వావ్.. చాక్లెట్ బొకేస్



సీతంపేట శ్రీ వంశీకృష్ణ గ్రూపునకు చెందిన మహిళలు తయారు చేసిన హోం మేడ్ చాక్లెట్ ఉత్పత్తులు వినియోగదారుల ప్రశంసలు అందుకుంటున్నాయి. హోం మేడ్ చాక్లెట్స్‌తో పాటు చాక్లెట్ బొకేలను ఈ గ్రూప్ సభ్యులు విక్రయిస్తున్నారు. ప్రత్యేక తయారీ సామగ్రిని దిగుమతి చేసుకుని వీటిని తయారు చేస్తున్నారు. చాక్లెట్ బొకేలు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు అందుబాటులో ఉన్నాయి.

నోరూరించే పచ్చళ్లు



భీమిలికి చెందిన ఉషోదయ డ్వాక్రా గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రుచికరమైన పచ్చళ్లు వినియోగదారులకు నోరూరిస్తున్నాయి. అపోలో ఫిష్, ప్రాన్స్, చికెన్, ఎగ్ పచ్చళ్లతో పాటు అన్ని రకాల వెజ్ పచ్చళ్లు అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. 3 నెలల వరకు నిల్వ ఉండేలా వీటిని సిద్ధం చేసినట్లు చెప్పారు. అర కేజీ బాక్స్‌లలో అపోలో ఫిష్ పచ్చడి రూ.400, చికెన్ రూ.450, ప్రాన్స్ రూ.700లకు విక్రయిస్తున్నారు.

సహజ 'పరిమళం'



ఆఫీస్, కార్యాలయం, ఇల్లు.. ఆలా చోటు ఏదైనా పరిమళాన్ని వెదజల్లే ఫ్రాగ్రెన్స్‌ను శ్రీ సాయి కిరణ్ గ్రూప్ సభ్యులు విక్రయిస్తున్నారు. సహజసిద్ధంగా తయారు చేసిన ఈ ఫ్రాగ్రెన్స్ రకాలను పదుల సంఖ్యలో అందుబాటులో ఉంచారు. అగరబత్తీల నుంచి సాంబ్రాణీ, కార్ ఫ్రాగ్రెన్స్ వరకు అన్ని రకాల ఉత్పత్తులు వీరి వద్ద ఉన్నాయి. గోమయం, ఆవు పంచకంతో పాటు ప్రత్యేక వనమూలికలను సేకరించి వీటిని తయారు చేసినట్లు తెలిపారు. అగరబత్తీ, సాంబ్రాణీ ప్యాకెట్లు రూ.50 కు విక్రయిస్తుండగా.. కార్ ఫ్రాగ్రెన్స్, రూమ్ ఫ్రాగ్రెన్స్ ధరలు రూ.80 నుంచి రూ.150 వరకు ఉన్నాయి.

మంగళగిరి.. న్యూలుక్



మంగళగిరి కాటన్స్ ఉత్పత్తిదారులు నేరుగా నిర్వహిస్తున్న స్టాల్‌లో పట్టు చీరలు, కలంకారీలో అనేక కొత్త ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు. ఫ్యాన్సీ కలంకారీ శారీస్, టస్సర్ మెటీరియల్, నిజాం బోర్డర్, రుద్రాక్ష బోర్డర్ చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. దీంతో పాటు అరటినారతో తయారు చేసిన చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. రూ.1500 నుంచి రూ.3000 వేల వరకు చీరలు అందుబాటులో ఉన్నాయి.

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా ఫెన్సింగ్ జట్ల ఎంపిక

మధురవాడ: కాకినాడలో ఈ నెల 28, 29 తేదీలలో జరిగే 10వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలకు హాజరయ్యే ఉమ్మడి జిల్లా జట్ల ఎంపికలు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో శుక్రవారం నిర్వహించారు. విశాఖ జిల్లా తరఫున తలపడే డిస్ట్రిక్ట్ క్యాడెట్ ఫెన్సింగ్ చాంపియన్ షిప్ 2024–25 అండర్–17 బాల బాలికల విభాగాల్లో ఎంపికలు జరిగాయి. బాలికల విభాగంలో ఇమంది జ్ఞానేశ్వరి, కావ్యశ్రీ, లలిత, రోహిణి, మానస, మహిమ, ఫరియా, హిమాన్షి, బాలురు విభాగంలో సుహిత్ విహారినాయుడు, లోహిత్, లేకజ్, తేజ ఎంపికైనట్లు విశాఖ జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్‌పీ త్రినాథ్ తెలిపారు. ఈ సెలక్షన్స్ విశాఖ జిల్లా అసోసియేషన్ ప్రతినిధి, ఎన్ఐఎస్ కోచ్ చరణ్, ప్రవీణ్‌ల ఆధ్వర్యంలో జరిగాయి.

జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక రేపు

గాజువాక : కర్నూలులో వచ్చే నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న ఎం.రంగారావు మెమోరియల్ 50వ అంతర్‌జిల్లాల బాలబాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా కబడ్డీ జట్ల ఎంపికను ఈనెల 29న నిర్వహించనున్నట్టు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉరుకూటి శ్రీనివాసరావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ పి.కోటేశ్వరరావు తెలిపారు. ఈ ఎంపిక పోటీలు గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు 76800 05666, 98856 98717 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.2 లక్షల విరాళం



ఏఈవోకు చెక్కు అందిస్తున్న దాత కృష్ణమూర్తి పాత్రుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు, నగరంలోని మధురవాడకు చెందిన పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు 2 లక్షల 116 రూపాయల విరాళాన్ని శుక్రవారం అందించారు. సింహగిరికి వచ్చిన దాత సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్‌కు ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి శేషవస్త్రం, ప్రసాదాన్ని అధికారులు అందించారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

ఏడీసీపీ కార్యాలయం సందర్శన



ఏడీసీపీ కార్యాలయంలో సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం ఏడీసీపీ(అడ్మిన్) కార్యాలయాన్ని సందర్శించారు. నగర పోలీస్ కమిషనరేట్ భవనంలోని సీపీఓలో గల పలు సెక్షన్లకు వెళ్లారు. ఏవో, ఆఫీస్ సూపరింటెండెంట్లు, ఇతర సెక్షన్ అధికారులు, సిబ్బంది విధులను సమీక్షించారు. రికార్డులను పరిశీలించి సంబంధిత అధికారులు పలు ఆదేశాలు జారీ చేశారు.

అందరి సహకారంతో అడ్డంకులను అధిగమిస్తున్నాం



సమావేశంలో పాల్గొన్న ఇన్‌చార్జి సీఎండీ, డైరెక్టర్లు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం వార్షిక సర్వసభ్య సమావేశం(ఏజీఎం) జరిగింది. ఉక్కు పరిపాలన భవనంలో జరిగిన 42వ ఏజీఎంకు స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సీఎండీ ఎ.కె.సక్సేనా అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ 2023–24లో తీసుకున్న వ్యూహాత్మక చర్యలను వివరించారు. ఉత్పత్తిలో గత ఏడాది ఎదుర్కొన్న సవాళ్లను వెల్లడించారు. సంస్థ నిర్వహణకు సహకరించిన ఉక్కు మంత్రిత్వశాఖ, రాష్ట్ర ప్రభుత్వం, సరఫరాదారులు, కస్టమర్లు, అనుబంధ యూనిట్లు, బ్యాంకర్లు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. భారత రాష్ట్రపతి తరఫున ఉక్కు మంత్రిత్వశాఖ డైరెక్టర్ సుదర్శన్ హాజరు కాగా, ఉక్కు మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ సంజయ్ రాయ్, స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు ఎ.కె.బాగ్చీ, ఎస్.సి.పాండే, గణేష్, జీవీఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికే తలమానికం ఐటీడీసీ-2024

- అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 3 రోజుల నాట్యనిపుణుల శిఖరాగ్ర సమావేశం
- తొలిరోజు ఏకకేళీ, బృంద, కూచిపూడిపై వర్క్‌షాప్ విజయవంతం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు



నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు

డాబాగార్డెన్స్: అంతర్జాతీయ సంప్రదాయ నాట్య నిపుణుల సదస్సు(ఐటీడీసీ–2024) దేశానికే తలమానికంగా నిలబెట్టిన నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిన రంగ విక్రమకుమార్ గౌడ్ అభినందనీయుడని జీఎస్టీ కమిషనర్ మహ్మద్ అలీ కొనియాడారు. నగరంలోని డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మూడు రోజుల సంప్రదాయ నృత్య శిఖరాగ్ర సమావేశాలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ సందర్భానికి సూచనగా నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థినులు, సంస్థ ప్రిన్సిపాల్ కేవీ లక్ష్మీ నృత్య పరికల్పన, స్వీయ పర్యవేక్షణలో ప్రదర్శించిన కూచిపూడి బృంద నృత్యం ఓం త్రినేత్రాయ, త్రిభువనపాల.. ఆద్యంతం ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. 40 ఏకకేళీ, బృంద నృత్య ప్రదర్శనలు, సీనియర్, జూనియర్ విభాగాల్లో రోజంతా నిర్వహించడంతో ఆడిటోరియంలో పండగ వాతావరణం నెలకొంది. మధ్యాహ్న భోజన విరామం తర్వాత రెండో సదస్సులో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ భాగవతుల సేతూరాం(తెలంగాణ) కూచిపూడి నాట్యం, 1960, 70 దశకాలలో భాగవతుల శైలిలో ప్రదర్శనలు, కాలక్రమేణా అన్వయించుకున్న సాంకేతిక సొబగులు అనే అంశాలను సోదాహరణంగా వివరించారు. మహారాష్ట్రకు చెందిన భరతనాట్య నిపుణురాలు కాశ్మీరా త్రివేది, చెన్నైకు చెందిన భరతనాట్య నిపుణుడు బి.కేశవరాజు పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, డాక్టర్ మధుసూదన్(కేరళ), డాక్టర్ పుష్పిత ముఖర్జీ(పశ్చిమ బెంగాల్), సుష్మా ఉదయ్ మహంతి(తెలంగాణ) తదితరులు పాల్గొన్నారు.

పసికందు మృతితో బంధువుల ఆందోళన

- విక్టోరియా ఆస్పత్రి వైద్యులే కారణమని ఆరోపణ
- విచారణకు ఆదేశించిన సూపరింటెండెంట్



విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న పసికందు బంధువులు

మహారాణిపేట: వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో పసికందు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషాప్రసాద్, ఇతర వైద్యులు, సిబ్బందిని నిలదీశారు. శుక్రవారం జరిగిన ఈ ఘటనపై ఓ గైనిక్ నిపుణుడు, పిల్లల వైద్యునిచే విచారణ జరిపిస్తామన్న సూపరింటెండెంట్ హామీతో బంధువులు ఆందోళన విరమించారు. వివరాలివీ..

మధురవాడ ప్రాంతానికి చెందిన ఆవుపాటి గాయత్రి(23) డెలివరీ కోసం ఈనెల 19న ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో చేరింది. 21న ఉదయం 6.30కు మగబిడ్డ జన్మించాడు. బిడ్డకు శ్వాస అందట్లేదని క్రమేపీ తగ్గుతోందంటూ మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు పంపారు. ఇక్కడ పిల్లల వైద్యులు, ఎన్ఐసీ యూనిట్ లేకపోవడంతో కేజీహెచ్‌కు తరలించవలసి వచ్చిందని ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు. కొద్ది రోజులుగా ఆరోగ్యంగా ఉన్న బాబు, ఆకస్మికంగా బాగాలేదని తమకు ముందుగా ఎలాంటి సమాచారం లేకుండా కేజీహెచ్‌కు ఎలా పంపిస్తారని బిడ్డ తల్లిదండ్రులు గాయత్రి, మణికంఠ, బంధువులు వైద్యులను నిలదీశారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బాబు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు కూడా ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టారు. పసికందు మృత దేహాన్ని బంధువులకు అప్పగించారు.

కారాగారంలో నిషేధిత వస్తువులపై నిఘా



కేంద్ర కారాగారం ఇంటర్వ్యూ జరిపే గేటు వద్ద అతికించిన పోస్టర్

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారం లోపలకు ఎలాంటి నిషేధిత వస్తువులు తరలించే అవకాశం లేకుండా చర్యలు చేపడుతున్నట్లు జైల్ సూపరింటెండెంట్ ఎం.మహేష్‌బాబు తెలిపారు. గతంలో గంజాయి, ఖైనీ, బీడీలు, సిగిరెట్లు తదితర నిషేధిత వస్తువులు కేంద్ర కారాగారంలో తరుచూ బయటపడుతుండేవి. ఇటీవల ఖైదీల కోసం గంజాయి తీసుకెళ్తుండగా సిబ్బందికి జైలు ఫార్మసిస్ట్ పట్టుబడిన విషయం సంచలనంగా మారడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖైదీలను కలవడానికి వచ్చే బంధువులు, స్నేహితులు నిషేధిత వస్తువులు తమ వెంట తీసుకెళ్లకూడదంటూ జైల్ ఇంటర్వ్యూ నమోదు గది, ఇంటర్వ్యూ గదుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ఉల్లంఘించిన వారిపై పోలీస్ కేసులు పెడతామన్నారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఇటీవల ఓ ఖైదీని కలవడానికి గంజాయి పొట్లాంతో వచ్చిన వ్యక్తి, ఇవన్నీ చూసి భయంతో ఓ మూలన పడేసినట్లు పేర్కొన్నారు.